క్లుప్తంగా

కార్పొరేట్ కళాశాలల ఆగడాలు అరికట్టాలి

చిత్తూరు కలెక్టరేట్ : కార్పొరేట్ కళాశాలల ఆగడాలను అరికట్టాలని టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుతేజ కోరారు. ఈ మేరకు వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ప్రయోగపరికరాలు, రసాయన పదార్థాలు లేవని చెప్పారు. ఈ కళాశాలల వైపు ఇంటర్మీడియట్ అధికారులు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

సాధనతోనే అభ్యసన మెరుగు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

ఐరాల: ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచే సాధన చేస్తే అభ్యసన మెరుగుపడుతుందని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మొదట మాతృభాషపైన పట్టు సాధించగలిగితే ఆంగ్లభాష అభ్యసన, గణితం, సైన్సు పట్ల పూర్తి స్థాయి అవగాహన అవుతుందన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థి అభ్యసనా స్థాయిని తెలుసుకుని వారికి తగిన రీతిలో బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనా ఆహారపదార్థాలను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలను మధ్యలో బడి మాన్పించొద్దు



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: చదువుకుంటున్న పిల్లలను మధ్యలో బడిమాన్పించరాదని తుంబపాళెం హెచ్‌ఎం చిట్టెమ్మ పేర్కొన్నారు. మండలంలోని జగమర్ల గ్రామంలో సోమవారం ఉపాధ్యాయుల బృందం పర్యటించి బడిమానేసిన పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ, జగమర్ల ఎస్టీకాలనీలో 6నుంచి 9 వ తరగతి చదువుకుంటున్న 11 మంది తుంబపాళెం జెడ్పీహైస్కూల్‌కు వచ్చేవారని చెప్పారు. ఇటీవల 11 మంది పిల్లలు సక్రమంగా బడికి రావడంలేదని, వారందరినీ బడికి పంపాలని సూచించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత విద్యా పథకాలను వివరించారు. పిల్లలు బడికి వచ్చివెళ్లేందుకు ప్రభుత్వం రవాణాచార్జీలను సైతం ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. పిల్లలకే విద్యే తరగని సంపదన్న విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని సూచించారు. ఉపాధ్యాయులు అమరేంద్ర, గంగులప్ప, జీఎంఎస్‌కే నవనీత, సిఆర్‌పి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మండల సచివాలయ కన్వీనర్‌కు సన్మానం



పూతలపట్టు: నూతనంగా ఎన్నికైన మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డిని సోమవారం తన నివాసంలో మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. పూలమాల, దశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు జీవరత్నం, మాసిల్లా మణి, భాస్కర్‌నాయుడు, మణి, ప్రవీణ్, బాలాజీ, రామ్మూర్తి, నాగరాజ్, షణ్ముగం, నిరంజన్‌రెడ్డి, ఉమాపతి, వెంకటరమణ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం




తవణంపల్లె: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లోకేశ్వరి అన్నారు. మండలంలోని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో సోమవారం జాతీయ సేవా సంస్థ, బ్రహ్మకుమారీస్ భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్, కల్పతరూష్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. పరిసరాలను శుభ్రం చేయించారు. కల్పతరూష్ మొబైల్ యాప్ ప్రయోజనాలను వివరించారు. జాతీయ సేవా సంస్థ నిర్వహణాధికారి శోభారాణి, బ్రహ్మకుమారీస్ ఫౌండేషన్ సభ్యులు వీణా, దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



● ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు అరుణ. మండలంలోని తేనేపల్లి ఎస్టీ కాలనీ. కూలీనాలీ చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. వచ్చే ఆదాయం ఇంటి అవసరాలకు సరిపోవడంతో సొంతిల్లు కలగానే మిగిలిపోతుందనుకున్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక ఇంటి పట్టా చేతిలో పెట్టి ఇల్లు కట్టుకోమని ఆర్థిక సాయం అందజేశారు. ఆ భరోసా, ఆర్థికసాయంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. పనులు చివరి దశలో ఉన్నాయి. జగనన్న చేసిన ఈ మేలును ఎప్పటికి మర్చిపోలేమని అరుణ పేర్కొంది.

ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. నిరుపేదల స్వగృహ నిర్మాణానికి పూర్తి సహకారమందిస్తోంది. ఇంటి స్థలం కేటాయింపుతోపాటు నిర్మాణ సామగ్రి, రుణాలను అందజేస్తోంది. మండల అధికారుల నిరంతర పర్యవేక్షణలో ఈ గృహాల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఉగాదికి లక్ష్యం పూర్తి చేయాలన్న ఉద్దేశంతో అధికార యంత్రాంగం ముందుకెళుతోంది.



పక్కాలగుట్టలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు (ఇన్‌సెట్) నిర్మాణం పూర్తయిన ఇల్లు

- పూతలపట్టు మండలంలో 1875 ఇళ్లు మంజూరు
- 406 మందికి ఇంటి స్థలాలు
- నిర్మాణానికి అన్ని రకాలుగా ప్రభుత్వం ఆర్థిక సాయం
- నిరంతర పర్యవేక్షణలో అధికారుల బృందం

స్వగృహమస్తు!

పేదల సొంతింటి కల సాకారం

పూతలపట్టు: మండలంలో 17 సచివాలయాల పరిధిలో 25 పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 266 గ్రామాల్లో 12,530 కుటుంబాలున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల ద్వారా సర్వే చేసి పక్కా ఇళ్ల మంజూరుకు అర్హులను గుర్తించారు. ఆ తర్వాత ఇంటి స్థలాల కోసం ప్రజలకు అనుకూలమైన స్థలాలను కేటాయించింది. మండల వ్యాప్తంగా 17 లేవుట్లలో 406 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని 1,875 మందికి ఇళ్లు మంజూరు చేసింది. మండలంలో ఇప్పటి వరకు 719 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 376 గృహాలకు పునాదులు పడ్డాయి. వివిధ దశల్లో 449 నిర్మాణాలు ఉన్నాయి. ఇంకా ప్రారంభం కాని ఇళ్లు 331 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోంది. మూడు, నాలుగు విడతల్లో బిల్లులను అందజేస్తోంది. ఇప్పటి వరకు 1,544 మంది లబ్ధిదారులకు గాను రూ.19.22 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో నగదు జమైందని అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఇక సిమెంట్ కావాల్సిన వారికి ఒక లబ్ధిదారునికి 90 బస్తాల చొప్పున అందిస్తున్నారు. ట్రాక్టర్ ద్వారా నాలుగులోడ్లు చొప్పున ఇసుక సరఫరా చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా 11,052 మందికి రూ.5,62 కోట్లు మంజూరు చేశారు.

ఉగాది కల్లా లక్ష్యం పూర్తి

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, వలంటీర్ల లక్ష్య సాధన కోసం పరుగులు పెడుతున్నారు. ప్రతి శనివారం విధిగా లేఅవుట్లను సందర్శిస్తున్నారు. లబ్ధిదారులతో మాట్లాడుతున్నారు. పనుల వివరాలపై ఆరా తీస్తున్నారు. నిర్మాణ పనులు చేపట్టని లబ్ధిదారులను గుర్తించి వారు ఇళ్ల పనులు ప్రారంభించేలా చేస్తున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉగాదికి లక్ష్యం పూర్తయ్యేలా అధికారులు ముందుకు కదులుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులుండే లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి తక్షణం డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా జగనన్న వైఎస్సార్ గృహ నిర్మాణ పనుల్లో జోరు పెరిగింది.

జగనన్న ఇచ్చిన వరం



మేము పూరిగుడిసెలో జీవిస్తున్నాం. రోజువారీ కష్టార్జితంతో ఇల్లు కట్టే స్థోమతలేదు. ఎండాకాలం, వానాకాలంలో అనేక ఇబ్బందులు పడ్డాం. జగనన్న వచ్చాక మాకు ఇంటి భాగ్యం కలిగింది. ఇంటి స్థలం పాటు పక్కా ఇల్లు మంజూరు చేశారు. ఇల్లు కట్టుకుంటున్నాం. త్వరలో గృహ ప్రవేశం చేయబోతున్నాం. మా కలను నిజం చేసిన జగనన్నకు తాము ఎల్లప్పుడూ రుణ పడి ఉంటాం. ఈ ఇంటిని వరంలా భావిస్తున్నాం.

– సరిత, తేనేపల్లి ఎస్టీ కాలనీ, పూతలపట్టు మండలం

ప్రభుత్వ ఆశయం నెరవేరేలా..



పేద ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఆ ఆశయం మేరకు తాము పనిచేస్తున్నాం. మండల వ్యాప్తంగా హౌసింగ్ నిర్మాణ పనులను వేగవంతం అయ్యేలా చూస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో లబ్ధిదారులతో మాట్లాడి, సమస్యలుంటే వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. హౌసింగ్ లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. లబ్ధిదారులు కూడా ఇంటి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలి. –గౌరి, ఎంపీడీఓ, పూతలపట్టు

పాడి ఆవులకు గర్భకోశ పరీక్షలు తప్పనిసరి



పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న పశుసంవర్థక శాఖ డీడీ ప్రభాకర్‌రావు

ఐరాల: పశు సంపదను అభివృద్ధి పర్చుకోవడానికి పాడి ఆవులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని పశుసంవర్థక శాఖ జేడీ వెంకట్రావు సూచించారు. మండలంలోని 35 యర్లంపల్లె పంచాయతీలో సోమవారం స్థానిక సర్పంచ్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్ (తిరుపతి), విర్బాక్ మందుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో పాడి ఆవులకు ఉచిత గర్భకోశ వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని పశుసంవర్థక శాఖ జేడీ, డీడీ ప్రభాకర్‌రావు ప్రారంభించారు. 150 పాడి ఆవులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, చూలు కట్టని తరుపులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జేడీ మాట్లాడుతూ పాడి ఆవులకు సంపూర్ణ ఆహారం అందించడం ద్వారా సమస్యను నివారించవచ్చన్నారు. కొన్ని పాడి ఆవులు సకాలంలో ఎదకు వచ్చినా రెండు మూడు సార్లు గర్భధారణ చేసినా చూలు నిలబడదు అని తెలిపారు. మళ్లీ మళ్లీ ఎదకు వస్తూనే ఉంటాయని, గర్భాశయంలో సూక్ష్మ జీవులున్నప్పుడు, వీర్యం నాణ్యత సరిగా లేనప్పుడు ఇలా అవుతుందని వివరించారు. సమస్యను గుర్తించి వెంటనే పశువైద్యుని సంప్రదించాలని సూచించారు. పశుపోషకులు పశువుల్లో సాధారణంగా వచ్చే వ్యాధుల గురించి, వాటి నివారణ పద్ధతులపై సరైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మూగ జీవాలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంబులెన్స్ సౌకర్యం కల్పించిందని గుర్తుచేశారు. టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేయగానే వాహనం నేరుగా ఆ గ్రామానికి చేరుకొని రైతు ఇంటి ముంగిటే సేవలందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల పశుసంవర్థక శాఖ ఏడీ పద్మావతి, మద్దిపట్లపల్లె పశు వైద్యాధికారి పినాకపాణి, పాలకల పశు వైద్యాధికారి రవికుమార్, గాజులపల్లె పశు వైద్యాధికారి పల్లవి, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు మునిసిపల్ ఆర్‌ఓగా గోపాలకృష్ణవర్మ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి (ఆర్‌ఓ)గా గోపాలకృష్ణ వర్మను నియమిస్తూ కమిషనర్ అరుణ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న వర్మను రెవెన్యూ అధికారిగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ విభాగాన్ని తనిఖీ చేసిన కమిషనర్.. మాన్యువల్‌గా వసూలు చేసిన ఆస్తి పన్ను పుస్తకాలు సీజ్ చేశారు. రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేస్తూ వర్మను ఆర్‌ఓగా నియమించారు.

శ్రీకాళహస్తీశ్వరునికి వినాయకుని పట్టు వస్త్రాలు



శ్రీకాళహస్తీశ్వర స్వామికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న కాణిపాకం అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు శ్రీకాళహస్తీశ్వరునికి సోమవారం సమర్పించారు. ఆలయ చైర్మన్, ఈఓ, అర్చకులు, అధికారులు శ్రీకాళహస్తి చేరుకోగా, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు, పాలక మండలి సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. వీరికి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కాణిపాకం ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం ఏఈవో సతీష్ పాల్గొన్నారు.

'స్పందన'లో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ×స్పందన¥ కార్యక్రమంలో 9 వినతులు అందినట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. ×స్పందన¥ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగర ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. ఆ వినతులను సకాలంలో క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ శాఖకు -2 టౌన్ ప్లానింగ్-4, రెవెన్యూ-2, ప్రజారోగ్య విభాగం -1 చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మీ, ఎంహెచ్‌వో డా.లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై పరిశీలన

చిత్తూరు రూరల్: స్పందన అర్జీలపై పరిశీలన చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆ అర్జీలను సంబంధిత వీఆర్‌ఓలు, డీటీలకు అప్పగించారు. దారి సమస్యలు, ఇంటి స్థలాలు, పట్టాపాసు పుస్తకం, రేషన్‌కార్డు తదితర సమస్యలపై మొత్తం 22 అర్జీలు వచ్చాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చూడాలని ఆమె ఆదేశించారు.

జునోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం

తిరుపతి తుడా: పెంపుడు జంతువుల నుంచి వ్యాపించే జునోసిస్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. స్విమ్స్ వైరాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జునోసిస్ వ్యాధులు, నియంత్రణ చర్యలపై సదస్సు నిర్వహించారు. ఇందులో డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు, జంతువులకు సైతం అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. వాటికి ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని, శుభ్రంగా ఉంచాలని సూచించారు. వైరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉష కళావత్, న్యూఢిల్లీకి చెందిన ఐఎస్పీపీ డైరెక్టర్ డాక్టర్ అజిత్ షెవాలే, డాక్టర్లు రామ్, రమేష్, నారాయణ, ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వం, పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

అంబారీపై ఆదిశంకరుని విహారం





మొగిలిలో గజవాహనంపై విహరిస్తున్న ఆదిశంకరుడు, కామధేను వాహనంపై శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి



అశ్వవాహనంపై ఊరేగుతున్న శివపార్వతులు

బంగారుపాళెం: మొగిలీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు సోమవారం ఉదయం ఆదిశంకరుడైన శ్రీమొగిలీశ్వరస్వామి, శ్రీకామాక్షమ్మవారు అంబారిపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. శ్రీస్వామి, అమ్మవారి మూలవర్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తుల స్వామి వారిని దర్శించుకున్నారు. గజ వాహన సేవకు మొగిలి వారిపల్లెకు చెందిన వసంతమ్మ, నంద, గాంధీ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

కామధేనువాహనంపై మొగిలీశ్వరుడి అభయం

శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి రాత్రి కామధేను వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కామధేను వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మాడ వీధుల్లో మంగళ వాయిద్యాలు, కీలుగుర్రాల ప్రదర్శనలు, చిన్నారుల కోలాటల నడుమ స్వామి, అమ్మవారు విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. కామధేను వాహన ఉత్సవానికి మొగిలి నాయీబ్రాహ్మణ సంఘం, పరిసర గ్రామస్తులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈఓ మునిరాజ, వంశపారంపర్య ధర్మకర్త విజయకుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మొగిలీశ్వరస్వామి కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు మొగిలీశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

అలరించిన నాదస్వర కచేరి

మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నాయీబ్రాహ్మణ సంఘం, మొగిలి పరిసర గ్రామస్తుల ఆధ్వర్యంలో నాదస్వర కచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఆలయం ఆవరణలో ఆలిండియా రేడియో, టీటీడీ, కంచికామకోటి పీఠం, కాణిపాక ఆలయ ఆస్థాన డోలు, నాదస్వరం విద్వాంసులు మురళి, బాలాజీ, సుధాకర్‌బాబు, వినాయకం నిర్వహించిన కచేరి భక్తులను అలరించింది. కార్యక్రమంలో ఆయన ఈఓ మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

ఐరావతంపై శివపార్వతులు

యాదమరి: మండల కేంద్రంలోని ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతులు సోమవారం ఐరావతం, అశ్వవాహనాలపై దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేకంగా గంగాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో ప్రల్లోలలో మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కల్యాణం కమనీయం

శివపార్వతుల ఉత్సవమూర్తులను మధ్యాహ్నం వధూవరులుగా అలంకరించి పచ్చటి పందిట్లో కొలువుదీర్చారు. వేద మంత్రాల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కల్యాణోత్సవాన్ని తిలకించారు. రాత్రి నూతన వధూవరులు ఐరావతంపై పుర వీధుల్లో విహరించగా, ఎర్రటినీళ్లతో దిష్టితీసి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సోది అలంకారంలో అంకాళ పరమేశ్వరి

చిత్తూరు రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుని చిత్తూరు నగరం గుర్రప్పనాయుడు వీధిలోని శ్రీ అంకాళ పరమేశ్వరి ఆలయంలో సోమవారం సోది అలంకారంలో అమ్మవారు కనువిందు చేశారు. సాయంత్రం మూలస్థానంలోని అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పిండిపదార్థాలను అమ్మవారికి నైవైద్యంగా సమర్పించి శాంతిపూజలు చేశారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అమ్మవారి ప్రసాదం, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ కేఎం కుమార్, అర్చకులు కుమార్ పాల్గొన్నారు.



సోది అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

రావణబ్రహ్మపై పార్వతీపరమేశ్వరులు



తవణంపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళభైరేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి రావణబ్రహ్మ వాహన సేవ వైభవంగా సాగింది. ఉదయం మూలవిరాట్ శ్రీ కాళభైరవ స్వామికి అభిషేకం, అర్చనలు చేయించారు. రాత్రి స్వామికి పూజా సామగ్రి, సుగంధపరిమళ పుష్పాలు, ప్రసాదాలను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులు పార్వతీపరమేశ్వరులకు అర్చకులు అభిషేకం, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పూజానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పల్లకిలో రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీరిన పార్వతీపరమేశ్వరులు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళ హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దీనికి ఉభయదారులుగా వన్నె కుల క్షత్రియులు మనోహర్‌గౌండర్, శ్రీరాములు కుటుంబసభ్యులుగా వ్యవహరించారు. మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అధికార నంది వాహన సేవను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్

ఐరాల: రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజల ముంగిట్లోకి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చుక్కావారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదల ముంగిట్లో వైద్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ధాత్రేయచౌదరి

తవణంపల్లె: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లి పేదలకు ఇంటివద్దనే వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారులు దాత్రేయచౌదరి, ప్రియాంక తెలిపారు. మండలంలోని ద్వారకాపురం, చారాలలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ద్వారకాపురంలో డాక్టర్ ప్రియాంక, చారాలలో డాక్టర్ దాత్రేయచౌదరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.